మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 29-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 269 Issue: 269

Published from Jagitial
Circulated to Telangana

29 మార్చి 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:16 సూర్యాస్తమయం - సా. 6:25 తిథి ఏకాదశి ఉ. 7:47 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఆశ్లేష మ. 2:37 వరకు తరువాత మఖ యోగం ధృతి సా. 6:19 వరకు కరణం విష్టి ఉ. 7:47 వరకు బవ రా. 7:28 వరకు వర్జ్యం రా. 2:42 నుండి తె. 4:19 వరకు దుర్ముహూర్తం సా. 4:47 నుండి సా. 5:36 వరకు రాహుకాలం సా. 4:54 నుండి సా. 6:25 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:52 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:40 నుండి తె. 5:28 వరకు అమృత ఘడియలు మ. 1:01 నుండి మ. 2:36 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున


## మైనింగ్ మాఫియా!

### రాఘువ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్

**ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి.. హరీశ్ రావు సంచలన ఆరోపణలు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘువ కన్‌స్ట్రక్షన్స్' శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అసెంబ్లీ సాక్షిగా ధ్వజమెత్తారు. సర్వే నంబర్ 62, 63లలో జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని ఆయన ఆరోపించారు.

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చినా, లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును ప్రస్తావిస్తూ హరీశ్ రావు ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. చిన్న తప్పు చేశారనే నెపంతో మహిపాల్ రెడ్డి తమ్ముడిని -2 వ పేజీలో...



## ఇసుక మాఫియా

### హరీశ్ రావు సోదరుడి అక్రమాలు

**దాంతో మైనింగ్ శాఖ కేటీఆర్ చేతిలోకి.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సోదరుడిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు తమ్ముడు మహేశ్వర్ రావు ఇసుక మాఫియా నడిపారని శాసనసభలో ఆరోపించారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని అన్నారు.

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మాజీ ఎంపీ సంతోష్ రావు, ఆయన తండ్రి రవీందర్ రావులపై తరువాయి 2 వ

## మనకిది సంధి దశ

సంక్షోభంలో ప్రపంచ దేశాలు



### పశ్చిమాసియా యుద్ధంతో తీవ్ర ప్రభావం

**అయినా దేశాన్ని కాపాడుకుంటున్నాం.. ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి**

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నోయిడా:నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ తరువాయి 2 వ పేజీలో...

## మూసీ తీరంలో ఓంకారం

### 700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం

### శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు తరువాయి 2 వ పేజీలో...



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు.



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,809 |
| వెండి (గ్రాము): | రూ.245 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,691 |

## రేప్ కేసుల్లో బాధితుల పేర్లు చెప్పొద్దు

**కుటుంబ సభ్యుల పేర్లూ బయటపెట్టొద్దు**

**సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు**

న్యూఢిల్లీ : అత్యాచార కేసుల్లో బాధితుల పేర్లను ప్రస్తావించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాధితుల పేర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించకూడదని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. 2018 నాటి తన తీర్పులో ఏ వ్యక్తి అయినా తమ ఆదేశాలను ఉల్లంఘించి బాధితుల పేర్లను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ముద్రించడం, ప్రచురించడం చేయకూడదని ఆదేశించింది. ఇది వరకు వెల్లడించిన తీర్పుల్లో బాధితులు, వారి కుటుంబీకుల పేర్లను ప్రస్తావించడంతో వారికి ఎదురయ్యే కళంకం గురించి తెలియకపోవచ్చని ధర్మాసనం పేర్కొన్నది.



## మీ భార్య మీ ఇష్టం!?

### అసహజ శృంగారం నేరం కాదు

**అది రేప్ ఎలా అవుతుంది?..మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు**

భోపాల్: భార్యతో 'అసహజ శృంగారం' జరిపారన్న ఆరోపణలపై భర్త మీద ఐపీసీ సెక్షన్ 377 కింద కేసు నమోదు చేయడం చెల్లదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు గ్వాలియర్ ధర్మాసనం ఒక కీలక తీర్పును వెలువరించింది. వివరాల్లోకి వెళితే, మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్తపై తీవ్ర ఆరోపణలు చేసింది. తన భర్త అసహజ శృంగారానికి పాల్పడ్డాడని, వరకట్నం తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



ఇంటి పనులు మాత్రమే చూసుకొనే మహిళలకు ఉన్నత స్థానం ఇచ్చేందుకు దుబాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. హౌస్ వైఫ్ స్థానంలో 'జనరేషన్ శార్పర్(పిల్లలను చాకుల్లా తయారుచేసేవాళ్లు)'గా మార్చాలని దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ ఆదేశాలు ద జారీ చేశారు.



## కవిత పార్టీ పెడితే తప్పేంటి?

### ప్రజాస్వామ్యంలో ఆ హక్కుంది

### ఆమె ఆలోచనను స్వాగతిస్తున్నాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కవిత పార్టీపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుందని... అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిందని ఆయన వ్యాఖ్యానించారు.

తెలంగాణ రాజకీయాల్లో రాబోయే కొత్త సమీకరణాలకు ఇది సంకేతమని అన్నారు. కొత్త పార్టీ పెట్టాలనే కవిత ఆలోచనను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఆయన విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి కేసీఆరే ప్రధాన కారణమని బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. "కాళేశ్వరానికి కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపీ పెట్టుకుని మరీ -2 వ పేజీలో...



## బెట్టింగేస్తే భరతం పడతాం

### హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరిక

ఐపీఎల్ సీజన్ వేళ హైదరాబాద్ పోలీసులు బెట్టింగ్ రాయుళ్లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్‌ను కేవలం ఆటలాగే ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): బెట్టింగ్‌పై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. గతంలో వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించినప్పటికీ, నిర్వాహకులు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. ముఖ్యంగా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ తరువాయి 2 వ పేజీలో...



## ఫస్ట్ మ్యాచ్ పాయే!

### ఎస్ఆర్‌హెచ్ ఓటమి

**చేజింగ్‌లో కింగ్.. అక్కడున్నది కోహ్లీ**

పడిక్కల్ మాస్ ఇన్నింగ్స్.. తొలి మ్యాచ్ ఆర్సీబీదే

.............పూర్తి వివరాలు (..క్రీడావాణి పేజీలో..)



# రాశి ఫలాలు

29.3.2026

మేషం: ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలలో స్థిరమైన లాభాలు అందుకుంటారు. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగమున అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి.

వృషభం: ఆర్థికంగా వాతావరణం అంతంత మాత్రంగానే ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇంటా బయట కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగమున ఇతరుల నుండి విమర్శలు తప్పవు. నిరుద్యోగులకు మిశ్రమ ఫలితాలుంటాయి.

మిధునం: విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. దూరప్రాంత బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సంతాన విద్యా విషయాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది.

కర్కాటకం: సోదరులతో ఆస్థి వివాదాలు కలుగుతాయి. బంధు మిత్రులతో ఏర్పడిన వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. కీలక వ్యవహారాల్లో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వాహన ప్రయాణాలలో నిర్లక్ష్యం పనికిరాదు. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

సింహం: ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమైన నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తిగా ఉంటుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున సందడిగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణ సమస్యల నుండి కొంతవరకు బయటపడతారు.

కన్య: ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. గృహనిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న అవసరానికి ధనం అందుతుంది.

తుల: కీలక వ్యవహారాల్లో జీవితభాగస్వామి సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. స్నేహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉండదు. నిరుద్యోగులకు అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతారు. కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: భూ సంబంధిత వివాదాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని పెద్దల ప్రశంసలు అందుకుంటారు. పాత మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు అప్రయత్నంగా పూర్తవుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశాలు అందిపుచ్చుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

కుంభం: సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వృధా ఖర్చులను అదుపు చేయడం కష్టంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఇతరులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలలో స్వల్ప ఇబ్బందులు ఉంటాయి. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

మీనం: ఇంటా బయట అనుకూలత వాతావరణం ఉంటుంది. సన్నిహితుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పనిభారం నుండి ఉపశమనం లభిస్తుంది. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.



# మైనింగ్ మాఫియా!

మొదటి పేజీ తరువాయి

రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారని, మరి అంతకంటే పెద్ద అక్రమాలకు పాల్పడుతున్న మంత్రి సంస్థపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. "అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?" అని మండిపడ్డారు. తన ట్వీట్లపై మంత్రి పొంగులేటి 'మొరిగే కుక్కలు' అంటూ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అది కచ్చితంగా పొంగులేటి సంస్థేనని స్పష్టం చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని, అందుకే వెంటనే రాజీనామా చేసి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రభుత్వానికి ఒక అల్టిమేటం జారీ చేశారు. "నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజాలైతే మాత్రం వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సంచలన ప్రకటన చేశారు. ఈ సవాల్‌తో అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

# ఇసుక మాఫియా

మొదటి పేజీ తరువాయి

విచారణ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధమని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో పాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. విచారణలో నిజానిజాలు నిగ్గుతేల్చి శాసనసభలో నివేదికను పెడతామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. వద్దిరాజు రవిచంద్ర వంటి వారిని బీఆర్ఎస్ నాయకులు బెదిరించి తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు.




# మూసీ తీరంలో ఓంకారం

మొదటి పేజీ తరువాయి

నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మనకిది సంధి దశ



మొదటి పేజీ తరువాయి

విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు.

# మీ భార్య మీ ఇష్టం!?

మొదటి పేజీ తరువాయి

కోసం వేధించాడని, దాడి చేసి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఆమె భర్తపై సెక్షన్ 377 (అసహజ నేరాలు), 498ఏ (వరకట్న వేధింపులు), 323 (దాడి), 506 (బెదిరింపులు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మిలింద్ రమేశ్ ఫడ్కే, సెక్షన్ 377 కింద నమోదైన కేసును కొట్టివేశారు. వివాహిత దంపతుల మధ్య జరిగే లైంగిక చర్యలను ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. "వైవాహిక బంధంలో భర్త తన భార్యతో చేసే లైంగిక చర్య రేప్ కాదు" అని సెక్షన్ 375లో ఉన్న మినహాయింపును కోర్టు ప్రస్తావించింది. అందువల్ల, భార్యాభర్తల మధ్య జరిగే అసహజ సంభోగాన్ని కూడా సెక్షన్ 377 కింద నేరంగా చూడలేమని స్పష్టం చేసింది. అయితే, వరకట్న వేధింపులు, దాడి, బెదిరింపులకు సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులను కొట్టివేయడానికి కోర్టు నిరాకరించింది. ఆ ఆరోపణలపై విచారణ కొనసాగించాలని ఆదేశించింది. ఇటీవల గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో వైవాహిక వివాదాల్లో సెక్షన్ 377ను ఆయుధంగా వాడుతున్నారని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.



# బెట్టింగేస్తే భరతం పడతాం

మొదటి పేజీ తరువాయి

మీడియా వేదికలుగా ఈ దందా కొనసాగుతోందని ఆయన వివరించారు. కేవలం డబ్బు కోసం ఇలాంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రదేశాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పైనా ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ పేర్కొన్నారు. బెట్టింగ్ కారణంగా అప్పులపాలై కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. తమ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే, వెంటనే డయల్ 100కు గానీ, 94906 16555 వాట్సాప్ నంబర్‌కు గానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# కవిత పార్టీ పెడితే తప్పేంటి?

మొదటి పేజీ తరువాయి

ఆయనే దీనిని డిజైన్ చేశారు" అంటూ ఎద్దేవా చేశారు. ఆయన తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే ప్రాజెక్టు కుంగిపోయిందని, వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని మండిపడ్డారు. ఈ పాపమంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉందని బండి సంజయ్ మండిపడ్డారు. ప్రధాని మోదీపై విమర్శలు చేసే క్రమంలో రేవంత్ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

# బడ్జెట్ లెక్కలు తెలియాలి

## యువత అవగాహన తెచ్చుకోవాలి.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

### వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు ప్రారంభం.. 'మై భారత్' ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, మార్చి 28 (పీఐబీ): యువత దేశాభివృద్ధికి దోహదపడే విధంగా బడ్జెట్‌పై అవగాహన పెంపొందించుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పిలుపునిచ్చారు. పాఠ్యపుస్తకాలకే పరిమితమవకుండా వార్తాపత్రికలు, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలోని అంశాలను విశ్లేషిస్తూ ద్రవ్యలోటు, వ్యయ విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఖర్చులు క్యాపిటల్ ఎక్స్పెండిచర్ వైపు మళ్లుతున్నాయా, లేక రెవెన్యూ ఎక్స్పెండిచర్ వైపు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించాలని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా వ్యక్తి చేతుల్లోనే ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రకటనల ప్రభావానికి లోనుకాకూడదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా ఆదాయపన్ను దాఖలు చేయడం నేర్చుకోవాలని సూచించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మై భారత్' కార్యక్రమంలో భాగంగా, నేషనల్ సర్వీస్ స్కీమ్ సమన్వయంతో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన ప్రతి జిల్లాకు చెందిన ఐదుగురు యువతతో మొత్తం 165 మంది పాల్గొంటున్నట్లు జిల్లా యువజన అధికారి తెలిపారు. 'కేంద్ర బడ్జెట్ 2026 -- యువత బలోపేతానికి వికసిత్ భారత్ 2047 సాధనకు సోపానం' అనే అంశంపై ప్రతి పోటీదారు మూడు నిమిషాల పాటు ఉపన్యసించనున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ జర్నలిస్టు దిలీప్ రెడ్డి, పీఐబీ అధికారి గాయత్రి, ఐఎఫ్ఎల్యూలో డాక్టర్ కే రాజారాం, ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ ఉపసంచాలకుడు ఎస్ నాగార్జున తదితరులు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ సీహెచ్ అంజిరెడ్డి మాట్లాడుతూ యువత వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.10 లక్షల ప్రమాద బీమా ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, యువజన అధికారులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగే ముగింపు సమావేశంలో రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఇళ్లు కూల్చి భారీ హోటళ్లా?

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ**

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్టవిరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3 వేల ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి కుంభకోణాలు, అవినీతి గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణిలో మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి బెదిరింపులు అలవాటుగా మారాయని, కానీ ఆయన బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడానికి ఖజానాలో ఒక్క రూపాయి లేదని చెబుతున్న ముఖ్యమంత్రి, మూసీ ప్రాజెక్టు కోసం మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం విడ్డూరమని అన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ అవినీతిని ప్రశ్నిస్తే, శివతాండవం చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరమని అన్నారు. ముఖ్యమంత్రి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

## ధురంధర్-2 సినిమాతో సమాజంలో విభజన

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): ధురంధర్-2 సినిమా సమాజంలో విభజనను పెంచుతోందని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన చిత్రం ధురంధర్-2. ఈ చిత్రం వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అయితే ఈ చిత్రంపై అసదుద్దీన్ విమర్శలు గుప్పించారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సంభాషణలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఆరోపించారు.

# ఇళ్లపై సోలార్ పెట్టించుకోండి

## ప్రజాప్రతినిధులకు బండి సంజయ్ అభ్యర్థన





హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): రాష్ట్రంలోని వార్డు మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ తమ ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కోటి ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రధాని నరేంద్రమోడీ సర్కార్ లక్ష్యమన్నారు. అందుకోసం రూ.75 వేల కోట్లకుపైగా నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ సోలార్ వ్యవస్థపై పూర్తిస్తాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన నివాసంపై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఉదయం టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్ తో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" కరపత్రాలను విడుదల చేశారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నా ఇంటిపై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నిత్యం ఈ దేశాన్ని కాపాడాలి. దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే మహానేత మోడీ. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం...ముఖ్యంగా చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందించాలనే అంత్యోదయ సిద్ధాంతంతో పనిచేస్తున్నారు'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. 'అందులో భాగంగానే దేశంలోని కోటి ఇండ్లపై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో 'పీఎం సూర్య ఘర్ -- ముఫ్త్ బిజిలీ యోజన" పథకాన్ని 2024 ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టినం. ఈ సోలార్ ప్యానల్ ద్వారా ఒక్కో ఇంటికి నెలకు 300 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 75 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినం'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ వెల్లడించారు.

**రూ.78వేల వరకు సబ్సిడీ**

'తొలుత ప్రజాప్రతినిధులంతా తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని మోదీ పిలుపునిచ్చారు. కాబట్టి వార్డ్ మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నా'కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. 'సోలార్ వ్యవస్థపై అవగాహన కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమవుతోంది. ఎందుకంటే 2024లో ఈ పథకం ప్రవేశపెట్టినా ఇంతవరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున 5 నుండి 7 వేల కుటుంబాలు సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకునేందుకు సరిపడా కేంద్రం నిధులు కేటాయించింది'అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అందుకే ప్రజలందరినీ కోరుతున్నా... ఒక్కో ఇంటిపై సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకుంటే... అందుకయ్యే వ్యయంలో 30 వేల నుండి 78 వేల రూపాయల వరకు సబ్సిడీ అందిస్తోంది. నా ఇంటి విద్యుత్ బిల్లులు ప్రతినెలా 25 నుండి రూ.30 వేలు ఖర్చు వస్తోంది. ఈ సోలార్ ప్యానెల్ ఏర్పాటు ద్వారా ఇకపై బిల్లులు రూ.5 వేలలోపే వచ్చే అవకాశముంది. అందుకే ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవాలి'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. 'విద్యుత్‌ను కొనుగోలు చేసే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలన్నది మోదీ ఆకాంక్ష. రైతులు, సామాన్య ప్రజలంతా ఈ సోలార్ వ్యవస్థను వాడుకుని కరెంట్ ను కొనే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలని కోరుతున్నా. పేద ప్రజలకు కూడా భారం కాకుండా సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకుంటే... 80 శాతం వరకు లోన్ వస్తుంది. అది కూడా వాయిదాల పద్దతిలో చెల్లించే అవకాశముంది. కాబట్టి ఏ మాత్రం భారం కాకుండా సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. అట్లాగే వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించి ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ థకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.

**1800 గా వాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు**

"పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజన' పథకం ద్వారా తెలంగాణలో 1800 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని టీజీ-రెడ్కో లక్ష్యం పెట్టుకుంది. రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, గ్రామ మండల సమాఖ్యలు ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇప్పటి వరకు కరీంనగర్ లో 46, సిరిసిల్లలో 17 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 63 ఆమోదం ఆమోదం పొందాయి'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.'రైతులు తమ పొలాలకు అవసరానికి మించి అదనపు విద్యుత్ ను ఉత్పత్తి చేస్తే డిస్కంలకు విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చు. పెద్ద ఎత్తున రైతులు ముందుకొచ్చి ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నా'కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## ఫుట్‌బాల్ ఆడిన రేవంత్

**ఘనంగా ఫస్ట్ ఎడిషన్ ప్రారంభం**

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): సుదీర్ఘ కాలం తర్వాత హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఎల్‌బీ స్టేడియం మళ్లీ క్రీడాస్ఫూర్తికి వేదికగా ప్రజాప్రతినిధుల సందడితో కోలాహళంగా మారింది. నాయకులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుందన్న "ఫిట్ లీడర్స్ ఫిట్ స్టేట్ సందేశంతో "తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ -- మొదటి ఎడిషన్" క్రీడలు ఆద్యంతం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిర్వహించే శాసనమండలి, శాసనసభ సభ్యులకు 14 సంవత్సరాలుగా నిలిచిపోయిన క్రీడా సంప్రదాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి ప్రారంభించారు. ప్రారంభించడమే కాకుండా సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పలు క్రీడల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని కలిగించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. 'ఎల్‌బీ స్టేడియంకు గొప్ప చరిత్ర ఉంది. ప్రపంచంలోనే పేరుగాంచిన క్రీడాకారులు ఈ మైదానంలో ఆడటమే కాకుండా శిక్షణ పొందారు. ఈ స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం. అలాగే గచ్చిబౌలిలో ఉన్న క్రీడా మైదానాలను రూ. 700 కోట్లతో ప్రపంచస్థాయి క్రీడా వసతులతో అభివృద్ధి చేస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'గచ్చిబౌలిలో 2034 లో నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. 3 నెలల్లో అక్కడ పనులను ప్రారంభించబోతున్నాం. వచ్చే మూడేళ్లలో క్రీడలన్నింటినీ గచ్చిబౌలి క్రీడా మైదానాల్లో నిర్వహించే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. బేగంపేట హాకీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. '1950-60 దశకంలో మొట్టమొదటిసారి భారత్ 4వ స్థానంలో నిలిచింది. ఆనాడు 7 మంది క్రీడాకారులు ఏంఎంఎవత్ఖుఘ్మం నగరానికి చెందినవారే ప్రాతినిధ్యం వహించారు. ఒకప్పుడు హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్ మన రాష్ట్రానికి నగరానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయి. ఇప్పుడు క్రీడల్లో వెనకబడ్డాం. యువతీయువకుల్లో క్రీడాస్ఫూర్తిని కలిగిస్తూ క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోంది'సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# పెట్రోల్ సరఫరాపై అపోహలు వద్దు



### కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (ఈవార్తలు): పెట్రోలియం ఉత్పత్తులతో పాటు ఎల్.పి.జి గ్యాస్ సరఫరాలో పెరిగిన వత్తిడిని ప్రభుత్వం సమర్ధవంతంగా నియంత్రించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు. శనివారం దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులతో పాటు వంటగ్యాస్ సరఫరాపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు,గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్,హార్దిప్ సింగ్ పూరి,ప్రహ్లాద్ జోషీలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే వీడియో కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా 14 మున్సిపల్ కార్పోరేషన్‌లకు చెందిన ప్రతినిధులతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,జీ. హెచ్ యం సి ప్రతినిధులు పాల్గొన్నారు.

**అపోహలు పెరగడంతోనే ప్రజల్లో గందరగోళం**

ఇరాన్- అమెరికాల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణ ప్రభావంతో పెట్రోలియం ఉత్పత్తులతో గృహ వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాపై ప్రజల్లో అపోహలు పెరిగి నందునే ప్రజల్లో అయోమయం నెలకొనిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళనలు పెరగడంతో తాత్కాలికంగా కొంత మేర ఇబ్బంది ఏర్పడిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకీ దిగి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో సమర్ధవంతంగా వత్తిడిని నియంత్రించ గలిగామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, డిమాండ్ కు తగిన రీతిలో సరఫరా కొనసాగుతోందని పైగా తాను స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు పంపిణీ దారులతో సమీక్షలు నిర్వహిస్తున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**కృత్రిమ కొరతను సృష్టించే వారిపై చర్యలు**

వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్.పి.జి కొరతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణాకు వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే కేటాయింపులను పెంచాలని ఆయన కేంద్ర మంత్రులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. కేంద్రం వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే గ్యాస్ కోటా కేటాయింపులను పెంచగలిగితే వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని రాష్ట్రమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. బ్లాక్ మార్కెట్ కు తరలించడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచి కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరా నెట్ వర్క్ విస్తరణలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ముందుకు పోతామన్నారు. హైదరాబాద్ లో భాగ్యనగర్ గ్యాస్ సంస్థ ద్వారా సి.ఎన్.జి సరఫరాను విస్తరిస్తున్నామని, జంట నగరాలలో ఆటోలు, ట్యాక్సీ లతో పాటు ప్రయివేటు వాహనాలకు సి.ఎన్.జీ సరఫరాకై ఫిల్లింగ్ కేంద్రాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.



జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్రలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, తెలంగాణ ప్రాంత ధర్మాచార్య కొత్తకోట శివానంద స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హిందూ బంధువులు, హనుమాన్ దీక్షా స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయన వెంట ముందుకు సాగారు. జగిత్యాలలోని మంచినీళ్ల బావి వద్ద ఉన్న గుండు శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచి జంబి హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించిన ఈ యాత్ర ఆద్యంతం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా శివానందస్వామి.. భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపిస్తూ, జై శ్రీరాం నినాదాలతో భక్తుల్లో ఉత్సాహాన్ని పెంచారు. అంతకుముందు 'ఈవార్తలు' దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్ స్వగ్రామం మల్యాల మండలం బల్వంతాపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శివానందస్వామి పాల్గొని, ఎడిటర్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం అందజేశారు.

- జగిత్యాల/మల్యాల, మార్చి 28 (ఈవార్తలు)



# బెంగాల్‌కు హాని చేస్తే ఖబర్దార్!

### కేంద్రంలో ఉన్న అధికారం పోతుంది

### బీజేపీకి మమత స్ట్రాంగ్ వార్నింగ్



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌కు హాని తలపెట్టే ప్రయత్నాలు బీజేపీ కొనసాగిస్తే, ఆ పార్టీ కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. రాణిగంజ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి గెలవడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని కూడా స్వాధీనం చేసుకోవడానికి వివిధ రాజకీయ పార్టీలను ఏకం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వారు బుల్డోజర్లను ఉపయోగించి అందరినీ బయటకు గెంటివేస్తారని హెచ్చరించారు. బెంగాల్‌కు నష్టం చేసే ప్రయత్నాలు చేస్తే బీజేపీ జాతీయస్థాయిలో దెబ్బతింటుందని అన్నారు. 'ఎస్ఐఆర్' ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితా నుంచి కొన్ని పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడటం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేవారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని హామీ ఇచ్చారు.

## జైషే టెర్రరిస్టుల నేరాల బాట

ఇస్లామాబాద్: ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జేఈఎమ్) తన కార్యకలాపాల కోసం సరికొత్త, ప్రమాదకరమైన వ్యూహానికి తెరతీసింది. భద్రతా దళాల ఆపరేషన్లతో తీవ్రంగా దెబ్బతినడం, పాకిస్థాన్ నుంచి నిధుల ప్రవాహం పూర్తిగా నిలిచిపోవడంతో.. స్థానికంగానే డబ్బు సంపాదించాలని తన కేడర్‌ను ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌తో పాటు పంజాబ్, హర్యానా, ఢిల్లీ నగరాల్లోని ధనవంతులను లక్ష్యంగా చేసుకుని కిడ్నాపులు, బెదిరింపు వసూళ్లకు పాల్పడాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ నెట్‌వర్క్ చిన్నాభిన్నమైంది. సంస్థ చీఫ్ మసూద్ అజర్ కుటుంబసభ్యులు కూడా పలువురు హతమయ్యారు. దీనికి తోడు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయడంతో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి ఉగ్రవాదుల చొరబాట్లు దాదాపు అసాధ్యంగా మారాయి. ఈ నేపథ్యంలో నిధుల కొరతతో సతమతమవుతున్న జైషే సంస్థ, తన ఓవర్ గ్రౌండ్ వర్కర్లను (ఓడబ్ల్యూజీ) రంగంలోకి దించింది. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారుల ప్రకారం, జమ్మూకశ్మీర్‌తో పాటు పంజాబ్, హర్యానా, ఢిల్లీలోని సంపన్నుల జాబితాను సిద్ధం చేసి, వారిని బెదిరించి డబ్బులు గుంజేందుకు ఈ వర్కర్లు ప్రయత్నిస్తున్నారు. అవసరమైతే వారి పిల్లలను కిడ్నాప్ చేసి భారీగా డబ్బు డిమాండ్ చేయాలని కూడా చూస్తున్నారు. ఇలా సమకూరిన డబ్బుతో కశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలను ముమ్మరం చేయాలన్నది వారి ప్రణాళిక. ఇటీవల పంజాబ్‌లోని మొహాలీలో ఓ డ్రైవర్‌ను హత్య చేసి, కారును దొంగిలించిన కేసులో జైషే మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించారు. నిధుల సేకరణ కోసమే ఈ దోపిడీకి పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. ఈ ఘటన రాబోయే ముప్పునకు ఒక సంకేతం మాత్రమేనని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. కేవలం నిధుల సేకరణే కాకుండా, ఐఎస్ఐ ఆదేశాల మేరకు సరిహద్దు రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్న వ్యక్తులను గుర్తించి, గూఢచర్య నెట్‌వర్క్‌లోకి లాగే ప్రయత్నాలు కూడా జైషే చేస్తోందని అధికారులు తెలిపారు.

## అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్ని ప్రమాదం



లక్నో: అయోధ్యలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సరయూ నది తీరంలోని జమ్తారా ఘాట్ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహా యజ్ఞంలో ప్రమాద ఘటన చోటుచేసుకున్నది. యజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక ఎకరం విస్తీర్ణంలో వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదైంది. కాగా, ప్రమాద సమయంలో ఘటనా స్థలిలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

# అమరావతిని ఎవరూ టచ్ చేయలేరు

**ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు**

అమరావతి, మార్చి 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని.. అది అమరావతేనని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అజేయం, అద్భుతం, అజరామరమని అభివర్ణించారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని పునరుద్ఘాటించారు. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అమరావతి ఆంధ్రప్రదేశ్ ఆత్మ అని, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అని అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్–5(2)ను సవరించాలని ఈ తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరారు. చట్టంలో రాజధానిని పేర్కొనేచోట 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చేర్చాలని ప్రతిపాదించారు. సీఆర్డీఏ చట్టం ప్రకారం నోటిఫై చేసిన ప్రాంతాలన్నిటికీ రాజధాని పరిధి వర్తింపజేసేలా చట్ట సవరణ చేయాలని కోరారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌తో పాటు కేంద్ర హోంమంత్రికి పంపించారు. ఈ తీర్మానం ప్రతుల్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపడం ద్వారా అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. రైతులు ఇచ్చింది కేవలం భూమి కాదని, రాష్ట్ర భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు. ఇదే సమయంలో, గత ప్రభుత్వంపై, ప్రతిపక్ష నేత జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తున్నానని చెప్పిన వ్యక్తి, అధికారంలోకి వచ్చాక రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని అంటారు. వీళ్లకు ఏదైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా? వీళ్లు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అనుసరిస్తారు, దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని" అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతికి రుణాలు రాకుండా ప్రపంచ బ్యాంకుకు ఈ–మెయిల్స్ పంపడం వంటి కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు.



తెలుగువారి చారిత్రక వైభవాన్ని గుర్తుచేస్తూ, కృష్ణానది తీరంలోని అమరావతిని రాజధానిగా చేసుకుని శాతవాహనులు పాలించారని చంద్రబాబు అన్నారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం 'అమరావతి గ్యాలరీ' మన ఘన చరిత్రకు నిదర్శనమని చెప్పారు. బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రాభవాన్ని కోల్పోయామని, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, ఇప్పుడు విభజనతో దాన్ని కూడా కోల్పోయి అమరావతిని నిర్మించుకుంటున్నామని వివరించారు. రాజధానులు కోల్పోతూ వివక్ష, అవమానాలు భరిస్తూ వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ప్రజావేదికను కూల్చివేసి విధ్వంస పాలనకు నాంది పలికిందని చంద్రబాబు ఆరోపించారు. అమరావతిని నాశనం చేసి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని మండిపడ్డారు. రాజధాని కోసం పోరాడిన రైతులపై లాఠీలతో కొట్టి, బూట్లతో తన్ని, అక్రమ కేసులు పెట్టి 'కీచకపర్వం' సాగించారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో అడ్డదారిలో ఆమోదింపజేయాలని చూసినా, న్యాయస్థానాలు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. ఈ తుగ్లక్ నిర్ణయాల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా పోయాయని విమర్శించారు. తాను విజన్–2020తో సైబరాబాద్‌ను ఇటుక ఇటుక పేర్చి నిర్మించానని, దాని ఫలితంగానే హైదరాబాద్ నగరం దేశంలోనే 'మోస్ట్ లివబుల్ సిటీ'గా నిలిచి, రూ.1.05 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తోందని చంద్రబాబు తెలిపారు. అదే స్ఫూర్తితో అమరావతిని కూడా దేశం గర్వించేలా 'బ్లూ అండ్ గ్రీన్ సిటీ'గా, భవిష్యత్ నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాజధాని ఒకటే అయినా, అభివృద్ధిని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని, విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. 2028 నాటికి పనులన్నీ పూర్తి చేసి అమరావతికి ఒక సంపూర్ణ రూపాన్ని తీసుకువస్తామని చంద్రబాబు శాసనసభకు హామీ ఇచ్చారు.

## జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్లు : పేర్ని నాని

తాడేపల్లి, మార్చి 28 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు. నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మాదీ అన్నారు!

### ఇక్కడి నుంచి పొమ్మన్నారు

**ఏపీ అసెంబ్లీలో పవన్ కల్యాణ్**



అమరావతి, మార్చి 28 (ఈవార్తలు): ఏపీ రాష్ట్ర విభజన జరిగిన కొత్తలో చంద్రబాబును కలిసినప్పుడు, "టెంట్ వేసుకునైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దాం" అని ఆయన అన్న మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అనుభవజ్ఞుడైన నేత చేతిలో రాష్ట్రం ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశంతోనే, 2014లో ఎటువంటి షరతులు లేకుండా తాను మద్దతు ఇచ్చానని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు ఒక బలమైన ఆశావాదిలా పనిచేశారని కొనియాడారు. సాధారణంగా భూసేకరణ అంటే ఎన్నో గొడవలు, అడ్డంకులు ఉంటాయని, కానీ అమరావతి కోసం రైతులు ఎటువంటి గొడవలు లేకుండా స్వచ్ఛందంగా భూములివ్వడం ఒక గొప్ప విషయమని పవన్ పేర్కొన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన వారందరికీ న్యాయం చేసేలా అప్పట్లోనే అడుగులు పడ్డాయని ఆయన వివరించారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అమరావతిపై అభాండాలు వేశారని, రాజధాని మహిళా రైతులను రోడ్లపై దారుణంగా కొట్టారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఇల్లు వదిలి బయటకు రాని ఆడవాళ్లు సైతం రాజధాని కోసం రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. గత పాలనలో చట్టసభల్లో దాడులు జరిగాయని, ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుకే రక్షణ లేని 'యుద్ధ వాతావరణం' ఉండేదని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రాన్ని విభజించినప్పుడు కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, దాని వల్లే ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పవన్ విమర్శించారు. "తెలంగాణ, ఆంధ్ర వేర్వేరు అనే భావన మాకు ఎప్పుడూ లేదు.. మా దృష్టిలో తెలుగు నేల ఒక్కటే" అని ఆయన ప్రకటించారు. అమరావతికి కల్పిస్తున్న ఈ చట్టబద్ధత భవిష్యత్తు తరాలకు ఒక భరోసా అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.






# నౌకామార్గాలు మూయడం దారుణం

## సౌదీ యువరాజుతో ప్రధాని మోదీ


న్యూఢిల్లీ:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా యువరాజు, ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ, ఆయా దేశాధినేతలతో ప్రధాని మోదీ సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సౌదీ ప్రధానితో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగడం, షిప్పింగ్ మార్గాలను సురక్షితంగా తెరిచి ఉంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలోని భారతీయులకు నిరంతరం తోడ్పాటు అందిస్తున్నందుకు యువరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

"సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో మాట్లాడి, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణపై చర్చించాను. ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను భారత్ ఖండిస్తుందని పునరుద్ఘాటించాను" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ పలుమార్లు గల్ఫ్ దేశాధినేతలతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఇరాన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, మలేషియా దేశాధినేతలతో ఇటీవల ప్రధాని మోదీ మాట్లాడారు. పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.



# నేపాల్ మాజీ ప్రధాని ఓలీ అరెస్టు

ఖట్మండు: నేపాల్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతన ప్రధాని బాలెన్ షా వచ్చీరావడంతోనే విపక్ష నేతలను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నేత కేపీ శర్మ ఓలీని పోలీసులు శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన 'జెన్-జీ' యువత ఉద్యమాన్ని అణచివేసిన ఘటనకు సంబంధించిన నరహత్య కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో రాజధాని ఖాట్మండూ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.



ఓలీతో పాటు మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్‌ను కూడా భక్తపూర్ జిల్లాలోని వారి నివాసాల నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం ఓలీ అస్వస్థతకు గురికావడంతో, ఆయనను ఖాట్మండూలోని ఓ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓలీ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయన నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కార్యకర్తలు ఖాట్మండూలో ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల టైర్లు కాల్చి, విచారణ కమిషన్ నివేదిక ప్రతులను దహనం చేశారు. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. శుక్రవారం కొలువుదీరిన ప్రధాని బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన తొలి కేబినెట్ సమావేశంలోనే విచారణ కమిషన్ నివేదికను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ అరెస్టులు కక్షపూరితమైనవని, చట్టవిరుద్ధమని యూఎంఎల్ పార్టీ ఖండించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, ఓలీ అరెస్ట్‌ను నేపాల్ మాజీ అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ 'అవివేక నిర్ణయం'గా అభివర్ణించారు. ఈ చర్య దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయవచ్చని, దేశంలో అస్థిరత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అధ్యయనం, న్యాయ ప్రక్రియ లేకుండా నివేదికను అమలు చేయడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాకిస్థాన్ టెర్రర్ ల్యాండ్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం దానికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తోంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జీటీఐ) 2026 ప్రకారం, ఉగ్రవాదం వల్ల అత్యంత ఎక్కువగా ప్రభావితమైన దేశంగా పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదికలోని గణాంకాలు పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాల వైఫల్యాలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. గ్రీక్ సిటీ టైమ్స్ తన కథనంలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సూచీలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. 2025 సంవత్సరంలోనే దేశంలో 1,045 ఉగ్రదాడులు జరిగాయని, వాటిలో 1,139 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది. మరో 1,595 మంది గాయపడగా, 655 మందిని ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. ఇండెక్స్‌లో 8.574 స్కోరుతో పాకిస్థాన్ అన్ని దేశాల కంటే ముందుంది. 2013 తర్వాత పాకిస్థాన్‌కు ఇదే అత్యంత హింసాత్మక సంవత్సరమని నివేదిక పేర్కొంది. ప్రపంచమంతటా ఉగ్రవాదం తగ్గుతుంటే, పాక్‌లో ఈ స్థాయి పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస భౌగోళికంగా కొన్ని ప్రాంతాలకే



పరిమితమైందని నివేదిక గుర్తించింది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే 2025లో మొత్తం దాడుల్లో 74 శాతం, మరణాల్లో 67 శాతం నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు నిరంతర అస్థిరత, బలహీనమైన ప్రభుత్వ నియంత్రణతో ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దు వెంబడి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని విశ్లేషించింది. పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా పాక్షిక పాలనలో ఉండటం వల్ల అల్-ఖైదా, హక్కానీ నెట్‌వర్క్, స్థానిక ఉగ్ర సంస్థలకు సురక్షిత స్వర్గధామంగా మారాయని నివేదిక వెల్లడించింది. డ్యూరాండ్ లైన్‌కు ఇరువైపులా ఉన్న జాతి, సామాజిక బంధాలు సరిహద్దులు దాటి ఉగ్రవాదుల కదలికలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల నిఘా, నియంత్రణ సంక్లిష్టంగా మారాయి. ప్రభుత్వ పాలన బలహీనంగా ఉన్న చోట ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఎలా పనిచేస్తాయో ఈ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని నివేదిక నొక్కి చెప్పింది. గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, నిర్మాణ లోపాల సంచిత ప్రభావమే పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితికి కారణమని గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ తేల్చి చెప్పింది. కొన్ని ప్రాంతాలలో దాడులు కేంద్రీకృతం కావడం, నిర్దిష్ట గ్రూపుల ప్రాబల్యం పెరగడం వంటివి పాక్ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడిని సూచిస్తున్నాయి. ఈ సూచీలో పాకిస్థాన్ అగ్రస్థానానికి చేరడం అనేది ఒక సుదీర్ఘ ప్రయాణం యొక్క ఫలితమని, ఈ పరిస్థితికి దారితీసిన అంశాలు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది.

# ఇరాన్‌కు మద్దతుగా హూతీలు

## ఇజ్రాయెల్‌పైకి క్షిపణి దాడి

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నెల రోజుల తర్వాత, ఇరాన్‌కు మద్దతుగా ఉండే యెమెన్ హూతీ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మొదటిసారి దాడి చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం ఓ వైపు దాడులు, మరోవైపు కాల్పుల విరమణకు సంప్రదింపులు జరుగుతున్న సమయంలో ఈ కీలకపరిణామం చోటుచేసుకుంది. హూతీలు మొదటిసారి కదనరంగంలోకి దిగారు. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా వారు క్షిపణి దాడులు నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై దాడులు చేసినట్లు హూతీల ప్రతినిధి యాహ్యా సారె ధృవీకరించారు. యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణిని గుర్తించి, దాడిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ క్షిపణిని అడ్డుకున్నాయని వెల్లడించింది. హూతీల దాడితో ప్రాణ, ఆస్తి నష్టం కలిగినట్లు తెలియరాలేదు. యుద్ధంలోకి హూతీలు రావడం చమురు మార్కెట్‌కు ఆందోళన కలిగించే అంశం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు క్రియాశీలకంగా వ్యవహరించారు. పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గంలో వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. అయితే నెల రోజులుగా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం జరుగుతున్నప్పటికీ హూతీలు కనిపించలేదు. తాజా దాడి చర్చకు దారితీసింది.



# శాంతి కావాలా? వద్దా?

## కావాలంటే మేం చెప్పింది వినాలి

## గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి హెచ్చరిక


టెహ్రాన్: మీకు అభివృద్ధి, భద్రత, శాంతి కావాలనుకుంటే, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను మీ భూభాగాల మీద నుండి దాడులు చేయకుండా నిరోధించాలని గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. గల్ఫ్ దేశాలపై దాడులు ఆగాలన్నా, శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలని స్పష్టం చేశారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకుని శత్రువులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వవద్దని షరతు విధించారు. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలను ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరించారు. ఇరాన్ ఎప్పుడూ ముందుగా దాడులు చేయదని స్పష్టంగా చెప్పామని అన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, ఆర్థిక కేంద్రాలు, అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే ప్రతీకారం తప్పదని పలుమార్లు హెచ్చరించామని గుర్తు చేశారు. శత్రుస్థావరాలు భూస్థాపితమయ్యే వరకు దాడులు చేస్తామని స్పష్టం చేశారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదిలేది లేదన్నారు.



# డీఎంకే జాబితా రిలీజ్

## పన్నీర్‌సెల్వంకు టికెట్

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో, అధికార ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే) తమ అభ్యర్థుల పూర్తి జాబితాను ప్రకటించి ఎన్నికల సమరానికి సర్వసన్నద్ధమైంది. రాష్ట్రంలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. శుక్రవారం విడుదల చేసిన ఈ జాబితా ప్రకారం, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సిట్టింగ్ స్థానమైన కోలత్తూరు నుంచే మరోసారి పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైలోని చేపాక్-ట్రిప్లికేన్ నుంచి తిరిగి బరిలోకి దిగుతున్నారు. ఈ ఎన్నికల్లో కీలక రాజకీయ పరిణామంగా, ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరణకు గురై డీఎంకే కూటమితో చేతులు కలిపిన సీనియర్ నేత ఓ. పన్నీర్‌సెల్వం తేని జిల్లాలోని బోడినాయకనూర్ నుంచి పోటీ చేయనున్నారు. గతంలో ఆయన ఈ నియోజకవర్గం నుంచి పలుమార్లు గెలుపొందారు. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు గాను డీఎంకే 164 చోట్ల పోటీ చేస్తుండగా, మిగిలిన 70 సీట్లను మిత్రపక్షాలకు కేటాయించింది. పార్టీ సీనియర్లు, మంత్రులైన దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్, సెంథిల్ బాలాజీ వంటి చాలా మందికి వారి సిట్టింగ్ స్థానాలనే మళ్లీ కేటాయించారు. అయితే, పొత్తులో భాగంగా మంత్రి మనో తంగరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పద్మనాభపురం సీటును కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారు. ఈసారి ఎన్నికలు డీఎంకే కూటమి, ఏఐఏడీఎంకే-ఎన్డీఏ కూటమి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే), నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) మధ్య చతుర్ముఖ పోటీకి వేదిక కానున్నాయి. తాజా జాబితా విడుదలతో డీఎంకే ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమైంది.





# హర్మూజ్ దాటిన భారత ఎల్పీజీ నౌకలు

టెహ్రాన్: భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శక్రవారం నాడు దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

లవ్లీ చిత్రం






## జూలైలో జననాయగన్ రిలీజ్!

కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మూవీ జన నాయగన్. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్ వినోథ్ దర్శకత్వం వహిస్తున్నాడు. తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో విడుదల కానుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ చిత్రం జనవరి 9నే వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో నిలిచిపోయింది. సినిమాలో కొన్ని సన్నివేశాలు మతపరమైన బావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని.. ఆర్మీ దళాలను సమస్యాత్మక కోణంలో చూపించారని సీబీఎఫ్‌సీ సెన్సార్ సర్టిఫికెట్‌ను జారీ చేయలేదు. ప్రస్తుతం ఈ మూవీ రివైజింగ్ కమిటీ ముందు ఉంది. రాబోయే రోజుల్లో రివైజింగ్ కమిటీ సినిమా చూడనుండగా.. ఆ తర్వాత సెన్సార్‌పై క్లారిటీ వచ్చే అవకాశాలున్నట్టు వార్తలు కూడా వచ్చాయి.

## తగ్గని రష్మిక జోరు!



నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతేకాదు, అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కూడా రష్మిక పేరు వినిపిస్తోంది.




## శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా

హిందీ నటుడు అక్షయ్ ఖన్నా ప్రస్తుతం మహాకాళి అనే ప్రతిష్టాత్మక చిత్రంతో కీలకపాత్రలో నటిస్తున్నారు . ఈ సినిమాకు ఆయన తన షూటింగ్ భాగాన్ని పూర్తిగా ముగించారు. చాలా తక్కువ రోజుల్లోనే ఈ సినిమాలోని కీలకపాత్ర షూటింగ్ అవ్వడంతో..ఈ విషయం ఆయన అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్‌గా మారింది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. భారతీయ పురాణాలను ఆధారంగా తీసుకుని ఆధునిక టెక్నాలజీతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది ఒక ముఖ్యమైన చిత్రంగా రాబోతోంది అని వెనుకరి. అక్షయ్ ఖన్నా పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన బీటీఎస్ (బ్యాక్‌స్టేజ్) ఫోటో విడుదల చేశారు. ఆ ఫోటోలో అక్షయ్ ఖన్నా.. శుక్రాచార్య పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన దర్శకుడితో మాట్లాడుతున్న సీన్.. అందరిని ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోతో సినిమా మీద ఆసక్తి మరింత పెరిగింది.

## 'పెద్ది' కోసం 'లెనిన్' వాయిదా

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా విడుదల తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తూ.. జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. 'నమస్కారం, లెనిన్ చిత్ర బృందం తరఫున ఈ ప్రకటన చేస్తున్నాం. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 1న విడుదల కావాల్సిన మా లెనిన్ సినిమాను వాయిదా వేస్తున్నామని తెలియజేస్తున్నాం. మా ఈ నిర్ణయానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. మా ప్రియమైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గారి పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో, సినిమా రంగంలో ఒకరికొకరం గౌరవం ఇచ్చుకుంటూ, ఆరోగ్యకరమైన వాతావరణంలో సినిమాలను కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని మేము నమ్ముతున్నాం. రామ్ చరణ్, అఖిల్ మధ్య ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. అఖిల్ గారికి చరణ్ గారు ఎప్పుడూ మంచి కోరే శ్రేయోభిలాషి. అందుకే, ఎంతో గౌరవంతో మేము ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించాలన్నదే మా లక్ష్యం. లెనిన్ చిత్రం అన్ని రకాల భావోద్వేగాలతో నిండిన ఒక పర్ఫెక్ట్ సినిమా వేడుకగా ఉంటుందని మీకు హామీ ఇస్తున్నాం. మా బృందం అత్యుత్తమ పనితీరుతో ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకువస్తుంది. అందుకే, లెనిన్ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2026 జూన్ 26న విడుదల చేయాలని నిర్ణయించాం. మీరు మాపై చూపిస్తున్న ప్రేమకు, అందిస్తున్న మద్దతుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం' అని టీం పేర్కొంది.








## నెట్‌ఫ్లిక్స్‌కు శర్వానంద్ 'భోగి' రైట్స్

చార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్‌లో ఉన్నాడు. సంక్రాంతికి వచ్చిన 'నారీ నారీ నడుమ మురారి' హిట్ తర్వాత, ఆయన ఇప్పుడు 'బైకర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపొందిన ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఇక ఈ సినిమా తర్వాత తన నెక్ట్స్ చిత్రాన్ని సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నాడు. మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు 'భోగి' అనే టైటిల్ ఫిక్స్ చేయగా ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. తాజాగా 'భోగి' చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. సాధారణంగా టీజర్ లేదా ట్రైలర్ చూశాకే ఓటీటీ డీల్స్ కుదుర్చుకునే ఈ రోజుల్లో, షూటింగ్ దశలోనే నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు ఈ సినిమాను కొనుగోలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

## 2029 నుంచి లాస్ ఏంజిల్స్‌కు ఆస్కార్



ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' (ఆస్కార్) ఒక చారిత్రాత్మక మార్పుకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ 'ఏఈజీ'తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది.

## మోనాలిసాపై పరువు నష్టం దావా వేస్తా




కుంభమేళా సమయంలో ఒక్క ఫొటోతో రాత్రికి రాత్రే సెన్సేషన్ అయిన మోనాలిసా స్టోరీ రోజుకో మలుపు తిరుగుతోంది. సంచార తెగకు చెందిన ఒక పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె... ఏకంగా సినీ రంగంలోకే అడుగుపెట్టేసింది. అయితే, ఫర్మాన్ ఖాన్‌ను మోనాలిసా భోంస్లే ప్రేమించి, పోలీసుల సమక్షంలో వివాహం చేసుకోవడంతో కథ కీలక మలుపు తీసుకుంది. ఆమెకు హీరోయిన్‌గా అవకాశం ఇచ్చిన దర్శకుడు సనోజ్ మిశ్రా ఈ పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వివాహం చట్టబద్ధంగా చెల్లదని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇద్దరి మధ్య చిచ్చు పెట్టాయి. సరోజ్ మిశ్రా వ్యాఖ్యలపై కేరళంలో జరిగిన విలేకరుల సమావేశంలో మోనాలిసా ఘాటుగా స్పందించారు. సినిమా షూటింగ్ సమయంలో ఆయన తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, లైంగికంగా వేధించాడని సంచలన ఆరోపణలు చేశారు.



## ఐటం గర్ల్ ముద్ర వద్దు: పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన పూజా హెగ్డే.. ప్రస్తుతం మాత్రం అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలోనే విక్టరీ వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఆదర్శ కుటుంబం – హౌస్ నెంబర్ 47 చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసే అవకాశం తలుపు తట్టిందని తెలిసింది. కానీ ఈ ఛాన్స్ ను అమ్మడు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. సాధారణంగా అవకాశాలు తక్కువగా ఉన్న సమయంలో ఏ చిన్న ఛాన్స్ వచ్చినా ఇండస్ట్రీలో నిలబడాలని భావిస్తారు. కానీ పూజ మాత్రం ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించడం చర్చనీయంశంగా మారింది. కనీసం ఐటం పాట అనే ప్రచారం కూడా నెట్టింట రావడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేనట్లు వ్యవహరిస్తోందిట. కేవలం ఒక పాటకే పరిమితం కావడం తన ఇమేజ్‌కు సరిపడదని పూజ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అమ్మడు నటించిన –జిగిల్ రాణి– సాంగ్స్ పెద్ద హిట్ అయినప్పటికీ సెకండ్ ఇన్నింగ్స్‌లో కేవలం హీరోయిన్‌గానే సత్తా చాటాలని పట్టుదలతో కనిపిస్తోంది. ఐటెం సాంగ్స్ చేయడం వల్ల స్పెషల్ సాంగ్ గర్ల్ అనే ముద్ర పడితే, భవిష్యత్తులో మెయిన్ లీడ్ రోల్స్ రావడం కష్టమని పూజాహెగ్డే దీర్ఘకాలిక ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.





## అభిషేక్ శర్మ తుస్..!

అభిషేక్ శర్మ వైఫల్యం కొనసాగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ అభిషేక్ శర్మ శుభారంభం అందుకోలేకపోయాడు. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చాడు. 8 బంతుల్లో ఒక సిక్సర్‌తో 7 పరుగులే చేసి వెనుదిరిగాడు. జాకోబ్ డఫీ వేసిన మూడో ఓవర్‌లో భారీ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. జాకోబ్ డఫీ వేసిన షార్ట్ బాల్‌ను అభిషేక్ శర్మ పుల్ షాట్ ఆడబోయాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి గాల్లోకి లేవగా.. కీపర్ జితేష్ శర్మ పరుగెత్తి క్యాచ్ తీసుకున్నాడు. దాంతో సన్‌రైజర్స్ 18 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఇదే ఓవర్ ఆఖరి బంతికి ట్రావిస్ హెడ్(11) కూడా క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు.



# ఫస్ట్ మ్యాచ్ ఆర్సీబీదే

### ఘన విజయం సాధించిన బెంగళూరు.. ఈజీగా ఓడిన సన్ రైజర్స్ హైదరాబాద్.. ఇషాన్ కిషన్ కెప్టెన్స్ ఇన్నింగ్స్ వృథా

ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) శుభారంభం చేసింది. శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది.

టాపార్డర్ వైఫల్యం, పేలవ బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మూల్యం చెల్లించుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 201 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్(38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 80) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. అనికేత్ వర్మ(18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 43), హెన్రీచ్ క్లాసెన్(22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31) దూకుడుగా ఆడారు.



ఆర్‌సీబీ బౌలర్లలో జాకోబ్ డఫీ(3/22), రొమారియో షెఫర్డ్(3/54) మూడేసి వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, సుయాష్ శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం ఆర్‌సీబీ 15.4 ఓవర్లలో 4 వికెట్లకు 203 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. దేవదత్ పడిక్కల్(26 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61), విరాట్ కోహ్లీ(38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 69 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించగా.. రజత్ పటీదార్(12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 31) దూకుడుగా ఆడారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో డేవిన్ పైన్ రెండు వికెట్లు తీయగా.. జయదేవ్ ఉనాద్కత్, హర్ష్ దూబే చెరో వికెట్ తీసారు. ఆర్‌సీబీ ఓపెనర్ ఫిల్ సాల్ట్(8) బ్యాటింగ్‌లో విఫలమైనా.. స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతను అందుకున్న మూడు క్యాచ్‌లు సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించాయి. ముఖ్యంగా హెన్రీచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ క్యాచ్‌లు మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్‌ను కేకేఆర్‌తో గురువారం(ఏప్రిల్ 2న) ఆడనుండగా.. ఆర్‌సీబీ తమ రెండో మ్యాచ్‌లో సీఎస్‌కేతో ఏప్రిల్ 5న తలపడనుంది.

## అంపైర్‌తో క్లాసెన్ వాగ్వాదం



సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ హెన్రీచ్ క్లాసెన్ ఆగ్రహానికి గురయ్యాడు. తన క్యాచ్‌ను థర్డ్ అంపైర్ మెరుగైన యాంగిల్స్‌లో చెక్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో హెన్రీచ్ క్లాసెన్ 22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31 పరుగులతో మెరుగ్గా ఆడాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. కానీ రొమారియో షెఫర్డ్ వేసిన 14వ ఓవర్‌లో ఫిల్ సాల్ట్ స్టన్నింగ్ క్యాచ్‌కు క్లాసెన్ ఔటయ్యాడు. రొమారియో వేసిన బ్యాక్ ఆఫ్ లెంగ్త్ డెలివరీని క్లాసెన్ మిడ్ వికెట్ దిశగా భారీ షాట్ ఆడాడు. అయితే బౌండరీ లైన్‌పై సాల్ట్ అద్భుతంగా బంతిని అందుకున్నాడు. అయితే అతని కాలు బౌండరీ లైన్‌ను తాకినట్లు అనిపించింది. దాంతో ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్ సమీక్ష కోరగా.. పలు యాంగిల్స్‌లో రివ్యూలను పరిశీలించారు. ఫిల్ సాల్ట్ బౌండరీ లైన్‌ను తాకకపోవడంతో ఔటిచ్చారు. అయితే ఒక యాంగిల్‌లో అతని శరీరం బౌండరీకి తాకినట్లు అనిపించింది. కానీ మరో యాంగిల్‌లో మాత్రం ఔట్‌గా తేలింది. హెన్రీచ్ క్లాసెన్ కూడా అంపైర్‌తో ఇదే విషయాన్ని చర్చించాడు. మరిన్ని మెరుగైన యాంగిల్స్‌లో పరీక్షించవచ్చు కదా? అని అసహనం వ్యక్తం చేస్తూ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. ఏది ఏమైనా ఫిల్ సాల్ట్ స్టన్నింగ్ క్యాచ్‌తో ఔరా అనిపించాడు.

## చరిత్ర సృష్టించిన ఇషాన్

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సారథ్యం వహించిన అత్యంత పిన్న వయస్కుడైన భారత ఆటగాడిగా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగలూరు(ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌తో ఇషాన్ కిషన్ ఈ ఫీట్ సాధించాడు. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెన్ను గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడంతో తాత్కలిక సారథిగా ఇషాన్ కిషన్ బాధ్యతలు అందుకున్న సంగతి తెలిసిందే. ఆర్‌సీబీతో తొలి మ్యాచ్‌లో కెప్టెన్‌గా బరిలోకి దిగిన ఇషాన్ కిషన్.. శిఖర్ ధావన్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. ఇషాన్ కిషన్ కంటే ముందు శిఖర్ ధావన్, మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథ్యం వహించారు. ఆరెంజ్ ఆర్మీకి సారథ్యం వహించిన అత్యంత పిన్న వయస్కుడిగా కేన్ విలియమ్సన్ కొనసాగుతున్నాడు.



## ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ నిషేధం ఎత్తివేత

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాల విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుంది. దేశంలో ఐపీఎల్ ప్రసారాలపై ఎలాంటి ఆంక్షలు లేవని, గతంలో విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు స్పష్టం చేసింది. క్రీడలను, రాజకీయాలను కలపదల్చుకోలేదని, ఈ అంశాన్ని పూర్తిగా వాణిజ్య కోణంలోనే చూస్తామని బంగ్లాదేశ్ కొత్త సమాచార, ప్రసార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వపన్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో బంగ్లాదేశ్‌లోని క్రికెట్ అభిమానులకు శుభవార్త అందినట్లయింది. ఈ విషయంపై మంత్రి జహీర్ ఉద్దీన్ మాట్లాడుతూ.. "ఐపీఎల్ ప్రసారాల కోసం ఇప్పటివరకు ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదు. క్రీడల్లోకి రాజకీయాలను తీసుకురావాలని మేము కోరుకోవడం లేదు. దీనిని మేము వాణిజ్యపరంగానే పరిశీలిస్తాం. ఏదైనా ఛానెల్ ప్రసారాల కోసం దరఖాస్తు చేసుకుంటే, సానుకూలంగా పరిశీలిస్తాం" అని డ్యుయిష్ వెల్లెకు తెలిపారు. స్టార్ స్పోర్ట్స్ వంటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌లు ఐపీఎల్‌ను ప్రసారం చేయాలనుకుంటే చేసుకోవచ్చని, ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించదని ఆయన స్పష్టం చేశారు.






## ధోనీ అభిమానులకు షాక్

ఐపీఎల్ 2026 సీజన్ సందడి ప్రారంభమైన వేళ సీఎస్కే అభిమానులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. జట్టు స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గాయం కారణంగా ఈ సీదన్ ప్రారంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. కాలి కండరాల నొప్పితో బాధపడుతున్న ఎంఎస్ ధోనీ.. దాదాపు మొదటి రెండు వారాల పాటు స్టేడియంలోకి దిగే అవకాశం లేదని సమాచారం. ఈ ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌కు ముందే సీఎస్కే యాజమాన్యం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ధోనీ ప్రస్తుతం కాలి కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నారని.. ప్రస్తుతం ఆయన రిహాబిలిటేషన్‌లో ఉన్నారని స్పష్టం చేసింది. జట్టు యాజమాన్యం ఆయన త్వరగా కోలుకుంటారని ఆశిస్తున్నప్పటికీ.. మొదటి 15 రోజుల పాటు ధోనీ అందుబాటులో ఉండడని తేలిపోయింది. 44 ఏళ్ల వయస్సులోనూ ఫిట్ నెస్‌తో అలరిస్తున్న ధోనీకి ఈ గాయం అడ్డంకిగా మారింది. మార్చి 30న గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఎంఎస్ ధోనీ లేకపోవడం జట్టు కాంబినేషన్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా మ్యాచ్ ఫినిషర్‌గా వికెట్ల వెనుక నుంచి బౌలర్లకు దిశానిర్దేశం చేసే విషయంలో ఎంఎస్ ధోని లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. ఒత్తిడి సమయాల్లో జట్టును శాంతపరిచే కూల్ కెప్టెన్ సలహాలు మిస్ అవ్వడం సీఎస్కే మైనస్ అని చెప్పుకోవచ్చు. ఎంఎస్ ధోనీ స్థానంలో వికెట్ల వెనుక ఎవరు ఉంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం సీఎస్కే వద్ద మూడు ప్రధాన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్ నుంచి ట్రేడ్ ద్వారా జట్టులోకి వచ్చిన సంజు శాంసన్ వికెట్ కీపింగ్‌కు ప్రధాన రేసులో ఉన్నారు. సంజు శాంసన్‌కు అంతర్జాతీయ అనుభవం ఉండటం సీఎస్కేకు కలిసొచ్చే అంశం. యువ ఆటగాడు కార్తీక్ శర్మ కూడా బ్యాకప్ కీపర్‌గా జట్టులో ఉన్నారు. డొమెస్టిక్ క్రికెట్‌లో రాణిస్తున్న ఉర్విల్ పటేల్ కూడా కీపింగ్ రేసులో ఉన్నారు. 278 ఐపీఎల్ మ్యాచ్‌ల అనుభవం ఉన్న ధోనీ లేని సీఎస్కేను ఊహించుకోవడం అభిమానులకు కష్టంగానే ఉంది. మరి ధోనీ లేని ఈ రెండు వారాల్లో చెన్నై ఎలా రాణిస్తుందో చూడాలి.

ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 29-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# 1857 స్ఫూర్తి!

భారతదేశం పరాయి పాలనలో మగ్గిపోతున్న కాలమది. ఈస్ట్ ఇండియా కంపెనీ అరాచకాలు, మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ధోరణులు పతాక స్థాయికి చేరాయి. ఆ సమయంలోనే బరాక్‌పూర్ సైనిక స్థావరంలో మంగళ్‌పాండే అనే 29 ఏళ్ల యువకుడు బ్రిటిష్ అధికారులపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆ ఒక్క నిప్పురవ్వే 'సిపాయిల ముట్టడి'గా, 'తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా దేశవ్యాప్తంగా వ్యాపించింది. మంగళ్ పాండే ప్రదర్శించిన ధైర్యం కేవలం ఒక వ్యక్తిగత కోపం కాదు, అది శతాబ్దాల అణచివేతపై భారతీయుల నిరసన. తాను నమ్మిన ధర్మం కోసం, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేయడానికి ఆయన వెనుకాడలేదు. ఏప్రిల్ 8న ఆయనను ఉరితీసినా, ఆయన రగిల్చిన స్వేచ్ఛా కాంక్ష మాత్రం ఆరలేదు. అది ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియా తోపే వంటి వీరులను కదిలించి, 1947లో మనం పొందిన స్వాతంత్ర్యానికి బీజం వేసింది. నేడు మనం తుపాకులతో యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. కానీ, ఆధునిక సమాజంలో యువత ఎదుర్కోవాల్సిన సవాళ్లు ఎన్నో ఉన్నాయి. అవినీతి, కులతత్వం, మహిళలపై వేధింపులు వంటి సామాజిక జాడ్యాలను రూపుమాపడానికి యువత గళం ఎత్తాలి. మౌనంగా ఉండటం అంటే అన్యాయానికి సహకరించడమే. పరాయి దేశాల ఉత్పత్తులపై ఆధారపడకుండా, 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో నూతన ఆవిష్కరణలు చేయాలి. మన ప్రతిభ దేశాభివృద్ధికే ఉపయోగపడాలి. నేటి యుద్ధాలు సోషల్ మీడియాలో, డేటా రూపంలో జరుగుతున్నాయి. తప్పుడు సమాచారాన్ని అడ్డుకోవడం, దేశ సమగ్రతను దెబ్బతీసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటం నేటి యువత బాధ్యత. మారుతున్న శీతోష్ణస్థితులు రేపటి తరానికి ముప్పుగా మారుతున్నాయి. ప్రకృతిని కాపాడుకోవడం కూడా ఒక దేశభక్తి పూరిత పోరాటమే. మంగళ్‌పాండే వంటి వీరులు మనకు నేర్పిన పాఠం ఒక్కటే– 'అన్యాయాన్ని సహించవద్దు, ఆత్మగౌరవాన్ని వదులుకోవద్దు' స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు వృథా కాకూడదంటే, నేటి యువత తమ మేధస్సును, శక్తిని నవభారత నిర్మాణానికి మళ్లించాలి. అప్పుడే మనం ఆ మహనీయులకు ఇచ్చే నిజమైన నివాళి. చరిత్ర కేవలం చదువుకోవడానికి కాదు, దాని నుంచి స్ఫూర్తి పొంది భవిష్యత్తును నిర్మించుకోవడానికి. మార్చి 29న మంగళ్‌పాండే రగిల్చిన ఆ విప్లవ జ్వాల, ప్రతి యువకుని హృదయంలో నిరంతరం ప్రకాశిస్తూనే ఉండాలి.

# ఆహారం అమృతం విషం!

**ఆహారం అమృతం కావాలి, కానీ నేడు అది 'స్లో ద పాయిజన్' (మెల్లని విషం)గా మారుతోంది. గత కొన్ని రోజులుగా ఏపీ, తెలంగాణలో వెలుగు చూస్తున్న కల్తీ ఉదంతాలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. అల్లం-వెల్లుల్లి పేస్టు మాత్రమే కాదు, పనీర్, నెయ్యి, ఐస్ క్రీం, టీ పొడి, చివరకు పిల్లలు తినే బిస్కెట్ల వరకు అన్నీ కల్తీ మయం అవుతున్నాయి. ఇటీవల హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన దాడుల్లో దిగ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి.**

**అత్తాపూర్, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లో సుమారు 7,000 కిలోల (70 క్వింటాళ్లు) కల్తీ పేస్టును స్వాధీనం చేసుకున్నారు. వెల్లుల్లి పొట్టు, ప్రమాదకర రసాయనాలు, సింథటిక్ రంగులు, గమ్ పౌడర్ ఉపయోగించి దీనిని తయారు చేస్తున్నట్లు తేలింది. సికింద్రాబాద్ గంజ్ బజార్ పరిసరాల్లో సుమారు 3,900 కిలోల కల్తీ పనీర్, పాల ఉత్పత్తులను సీజ్ చేశారు. భరత్ నగర్ వంటి ప్రాంతాల్లో కుళ్లిన చికెన్ (సుమారు 800 కిలోలు) విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.**





**శశిధర్ అక్కెల**
హైదరాబాద్

సింథటిక్ రంగులు కలిపిన ఐస్ క్రీంలు, టీ పొడి, కాలంచెల్లిన నూనెలు బ్రాండెడ్ లేబుళ్లతో మార్కెట్లోకి వస్తున్నాయి. కొందరు స్వార్థపరులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలనే దురాశతో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. లైసెన్సులు లేని తయారీ కేంద్రాలు, అత్యంత అపరిశుభ్రమైన వాతావరణం, ఎలుకలు, బొద్దింకల మధ్య ఆహార పదార్థాల తయారీ వంటివి కలవరపెడుతున్నాయి. ఈ కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయ వ్యాధులు, మూత్రపిండాల సమస్యలు వంటి తీవ్రమైన ఆరోగ్య విపత్తులు సంభవిస్తున్నాయి. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, కల్తీ మాఫియా పంజా విసురుతూనే ఉంది. కేవలం జరిమానాలు, సీజ్ చేయడం సరిపోదు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన శిక్షలు పడేలా చూడాలి. పండుగల సమయంలోనే కాకుండా, ఏడాది పొడవునా హోటళ్లు, తయారీ కేంద్రాలపై నిఘా ఉంచాలి. వినియోగదారులు కూడా పదార్థాలను కొనేటప్పుడు వాటి నాణ్యత, ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపును గమనించాలి. అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి.

**కల్తీకి అడ్డాగా హైదరాబాద్**

హైదరాబాద్ అంటే ఒకప్పుడు రుచికరమైన బిర్యానీలకు, ఘుమఘుమలాడే వంటకాలకు చిరునామా. కానీ నేడు అది 'కల్తీ' సామ్రాజ్యానికి రాజధానిగా మారుతుండటం ఆందోళనకరం. గత రెండు మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, ఆహార భద్రతలో మన పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో – 2022 నివేదిక ప్రకారం, దేశంలోని 19 మెట్రో నగరాల్లో నమోదైన మొత్తం 291 కల్తీ కేసుల్లో, ఒక్క హైదరాబాద్‌లోనే 246 కేసులు నమోదయ్యాయి. అంటే దేశంలోని మొత్తం కల్తీ కేసుల్లో సుమారు 84% మన నగరంలోనే ఉండటం గమనార్హం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, 2021 నుండి సెప్టెంబర్ 2024 వరకు తెలంగాణలో సేకరించిన 15,702 నమూనాల్లో 2,387 (సుమారు 15%) కల్తీవని తేలింది. అంటే మనం కొనే ప్రతి 100 వస్తువుల్లో 15 వస్తువులు ఆరోగ్యానికి ప్రమాదకరమైనవే. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన 'స్టేట్ ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ 2023–24'లో తెలంగాణ 28 రాష్ట్రాల్లో 24వ స్థానానికి పడిపోయింది. 100 మార్కులకు గాను కేవలం 35.75 మార్కులు మాత్రమే సాధించడం మన వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. కేవలం 2026 మార్చి నెలలోనే హైదరాబాద్ పోలీసులు ఐదుకు పైగా భారీ అల్లం–వెల్లుల్లి కల్తీ కేంద్రాలను ఛేదించారు. సుమారు 70 క్వింటాళ్ల (7,000 కిలోలు) కల్తీ పేస్టును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో టైటానియం డయాక్సైడ్, గమ్ పౌడర్, సింథటిక్ రంగులు కలుపుతున్నట్లు తేలింది. మే 2025లో జరిగిన దాడుల్లో 58 ప్రైవేట్ హాస్టళ్లలో అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారాన్ని గుర్తించి 30 హాస్టళ్లకు నోటీసులు ఇచ్చారు. కల్తీ దందా ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం 'శిక్షల భయం' లేకపోవడమే. 2023లో తెలంగాణలో 382 కల్తీ కేసులు నమోదైనప్పటికీ, 'ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్టరేషన్ యాక్ట్' కింద ఒక్క కేసు కూడా నమోదు కాలేదని నివేదికలు చెబుతున్నాయి. కల్తీకి పాల్పడేవారికి భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ సెక్షన్ల కింద కఠిన శిక్షలు పడాలి. వినియోగదారులు కల్తీని గుర్తించేలా అవగాహన పెంచుకోవాలి. అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. మనం తినే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. లాభాపేక్షతో సామాన్యుల ప్రాణాలను పణంగా పెడుతున్న కల్తీ మూకలను ఏరివేయనంత వరకు, భాగ్యనగరం ఆరోగ్యకరమైన నగరంగా ఎదగలేదు. ఇది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు, సమాజం అంతా ఏకం కావాల్సిన అత్యవసర స్థితి.

తెలుగు దేశం

# 44 వసంతాల శంఖారావం

**తెలుగు నేల రాజకీయ చరిత్రలో 1982 మార్చి 29 ఒక చారిత్రాత్మక మలుపు. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలుగుదేశం పార్టీకి ప్రాణం పోశారు. నేటితో ఈ పార్టీ విజయవంతంగా 44 వసంతాలు పూర్తి చేసుకుని, తెలుగు జాతి అభివృద్ధిలో తనదైన ముద్ర వేసింది.**

అప్పటి రాజకీయ పరిస్థితుల్లో కేంద్రం నుంచి ఎదురవుతున్న అవమానాలను ఎదిరించి, తెలుగువారికి ఒక గుర్తింపు తేవడమే ధ్యేయంగా ఎన్టీఆర్ ఈ పార్టీని స్థాపించారు. పార్టీ పెట్టిన కేవలం 9 నెలల్లోనే అంటే 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో 202 స్థానాలను గెలుచుకుని అధికారంలోకి రావడం భారత రాజకీయాల్లోనే ఒక పెను సంచలనం. ఎన్టీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ రాజకీయాలకు దిక్సూచిగా ఉన్నాయి. రెండు రూపాయలకే కిలో బియ్యం: పేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలనే సంకల్పం. మండల వ్యవస్థ: పరిపాలనను ప్రజలకు దగ్గర చేయడం కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థలో కీలక మార్పులు తెచ్చారు. మహిళా సాధికారత: ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించడం, పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు వంటివి సామాజిక విప్లవాన్ని తెచ్చాయి. ఎన్టీఆర్ నిర్మించిన పునాదులపై నారా చంద్రబాబు నాయుడు ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి బాటలు వేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ పటంలో నిలబెట్టిన ఘనత ఆయనదే. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఒక ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే సంకల్పం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ పసుపు రంగు జెండా సంపద, శక్తికి చిహ్నం. పార్టీ గుర్తు సైకిల్ సామాన్యుని ప్రగతికి, రైతులకు (నాగలి), కార్మికులకు (చక్రం), కుటుంబాలకు (ఇల్లు) ప్రాతినిధ్యం వహిస్తుంది. సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ సూక్తితో ప్రారంభమైన ఈ ప్రయాణం, నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించే తెలుగుదేశం పార్టీ, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది.

**- కాశీవరపు నాగేశ్వరరావు, విజయవాడ**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.